
సాక్షి
శ్రీకాకుళం
బుధవారం : 19 : జూన్ : 2024



ప్రైవేటు బడుల్లో ఫీజులుం
ప్రైవేటు బడులు ఫీజులు పెంచాయి. పుస్తకాల పేరుతోనూ దోచుకుంటున్నాయి. - 8లో



ముమ్మరంగా జీడి కొనుగోలు
జీడి పిక్కల కొనుగోలు ముమ్మరంగా జరుగుతోంది. గ్రామాలకు వచ్చి కొంటున్నారు. - 8లో



ఉత్సాహంగా ఉపాధి
పలాస, మందస మండలాల్లో ఉపాధి ఉత్సాహంగా సాగుతోంది. వేతనదారులు జోరుగా పనిచేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీముఖలింగంలో బలిహరణ



అష్టదిక్పాలకులు బలహరణ నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం అర్చకులు అష్టదిక్పాలకులు బలిహరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, దర్శనాలు నిర్వహించి హోమం అనంతరం బలిహరణ నిర్వహించారు.

'పథకాలు రైతులకు సాయం చేస్తాయి'



మాట్లాడుతున్న జేసీ నవీన్

ఆమదాలవలస: ప్రభుత్వ పథకాలు రైతులకు తోడ్పాటును అందిస్తాయని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత ప్రసార(లైవ్ టెలికాస్ట్) కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 29వేల మంది రైతులకు ఈ 17వ విడత కిసాన్ సమ్మాన్ నిధిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని వారణాశిలో విడుదల చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కేవీకే ప్రొగ్రాం కోఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, వ్యవసాయ శాఖ జేడీ కె.శ్రీధర్, ఆత్మ పీడీ డాక్టర్ ఎ.రామచంద్రరావు, వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ చిట్టిబాబు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పైడి వెంకటరావు, కేవీకే శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి శుభాకాంక్షల వెల్లువ



కేంద్ర మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ సర్వీసుల సంఘం సభ్యులు

శ్రీకాకుళం: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జిల్లాకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా శాఖ, ఏపీ జేఏసీ అమరావతి జిల్లాశాఖ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర మంత్రి కార్యాలయంలో శాలువతో సన్మానించి సత్కరించారు. 80 ఫీట్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకర్‌ను కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఆర్‌జీయూకేటీ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం అధికారులు శ్రీకాకుళం ఎంపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియ జేశారు. డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి మునిరామకృష్ణలతో కూడిన అధికారులు కలిసారు. విద్యా సంస్థ ప్రగతికి కృషి చేయాలని కోరారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి



కొమ్మాన పున్నమ్మ (ఫైల్)

టెక్కలి రూరల్: స్థానిక జిల్లా ఆస్పత్రి సమీపంలో మంగళవారం ఓ వృద్ధురాలు వడదెబ్బ తగిలి మృతిచెందారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. నందిగాం మండలం హరిదాసుపురం గ్రామానికి చెందిన కొమ్మాన పున్నమ్మ(70)అనే వృద్ధురాలు మంగళవారం టెక్కలి జిల్లా ఆస్పత్రికి వచ్చారు. ఆస్పత్రి సమీపానికి వచ్చేసరికి ఎండ తీవ్రతకు ఎటూ వెళ్లలేక ఓ దగ్గర కూర్చుండిపోయారు. దీంతో అక్కడున్న వారు హుటాహుటిన ఆస్పత్రిలోకి తీసుకెళ్లగా వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించారు. కానీ కాసేపటికే ఆమె మృతి చెందారు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పాటు ఎండ దెబ్బ తగలడంతో ఆమె మృతి చెంది ఉంటుందని స్థానికులు తెలిపారు. మృతురాలికి ఓ కుమారుడు ఉన్నాడు. ఆయన సీఆర్పీఎఫ్ జవానుగా పనిచేస్తున్నాడు. అలాగే ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి భర్త గతంలో మరణించారు.

పసుపు బిళ్ల.. అచ్చెన్న తొలి జెల్ల!

- ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసిన మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు
- పసుపు బిళ్ల వేసుకుని ప్రభుత్వ కార్యాలయానికి వెళ్తే టీ ఇచ్చి పనిచేయాల్సిందేనని హుకుం
- అలా చేయకపోతే ఏమవుతుందో ఉద్యోగులకు తెలుసు అంటూ హెచ్చరిక
- పార్టీ కార్యకర్తల ముందు ఉద్యోగులకు వార్నింగ్ ఇచ్చేలా వ్యాఖ్యలు
- సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న వ్యాఖ్యలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

'నేను మాటిస్తున్నాను.
రేపు అధికారులకు సమావేశం పెట్టి చెబుతాను.
రేపటి నుంచి ప్రతి కార్యకర్త ఎస్‌ఐ దగ్గరకు వెళ్లినా..
ఎమ్మార్వో దగ్గరకు వెళ్లినా.. ఎండీఓ దగ్గరకు వెళ్లినా..
ఏ ఆఫీసుకు వెళ్లినా..
మీరు పసుపు బిళ్ల పెట్టుకుని వెళ్లండి.
మీకు గౌరవంగా కుర్చీ వేసి, టీ ఇచ్చి.. మీ పనేంటి అని అడిగి మీ అందరికీ పనిచేయించే విధంగా అధికారులను లైనులో పెడతాను.
ఎవరైనా ఒకరో ఇద్దరో నా మాటకు జవదాటితే ఏమవుతారో వాళ్లకు నేను చెప్పవలసిన అవసరం లేదని తెలియజేస్తున్నా'..

కార్యకర్తల ఆత్మీయ సభ, ఉద్యోగుల తొలి సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలివి.

ఇప్పుడీ వ్యాఖ్యలు ఉద్యోగ వర్గాల్లోనే కాదు సోషల్ మీడియానూ కుదిపేస్తున్నాయి.

ఇప్పుడే కాదు గతంలో పలు సందర్భాల్లో అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు అటు టీడీపీలోనూ, ఇటు రాష్ట్రంలో సంచలనంతో పాటు వివాదాస్పదమైన సందర్భాలు ఉన్నాయి. కొత్తగా మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి జిల్లాకొచ్చాక చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా ఉద్యోగ వర్గాలను కుదిపేశాయి. టీడీపీ శ్రేణులను ప్రభుత్వ కార్యాలయాలకు దూకుడుగా వెళ్లేలా ప్రోత్సహించేలా ఉన్నాయి.



అచ్చెన్నాయుడుకు మంత్రిగా పనిచేయడం కొత్తేమీ కాదు. 2014–19లో కూడా పనిచేశారు. అప్పట్లో కూడా కాస్త కటువుగా మాట్లాడిన సందర్భాలున్నాయి. అయితే ఈ సారి అలా ఉండబోరని, ఉద్యోగులతో స్నేహ పూర్వకంగా ఉంటారని ఆయా వర్గాలు ఆశలు పెట్టుకున్నాయి. కానీ మంత్రిగా ప్రమాణ స్వీకారం తర్వాత వచ్చిన తొలి పర్యటనలోనే ఉద్యోగులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఆయా వర్గాలు స్వీకరించలేకపోతున్నాయి. జాగ్రత్తగా పనిచేయండి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రండి, ప్రజల్ని ఇబ్బంది పెడితే చర్యలు ఉంటాయి, ఏదైనా పనుల కోసం టీడీపీ నాయకులు, కార్యకర్తలు వస్తే చూసి చేయండి, ప్రభుత్వ లైన్‌లో పనిచేయండి అనే విధంగా ఎవరైనా మాట్లాడుతారని.. కానీ అందుకు భిన్నంగా అచ్చెన్నాయుడు హెచ్చరిస్తూ మాట్లాడటాన్ని ఉద్యోగ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి.

'టీడీపీ కార్యకర్తలు ఇక నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు మెడలో పసుపు బిళ్ల వేసుకుని వెళ్లండి. అధికారులు మీకు కుర్చీ వేసి, టీ ఇచ్చి పని ఏంటి అని అడిగి ఆ పనిని చేసి పంపిస్తారు. ఎవరైనా అధికారులు మాట వినకపోతే ఏం జరుగుతుందో వాళ్లకు తెలుసు' అని కార్యకర్తల ముందు చెప్పడం సరికాదని ఉద్యోగులు బాధపడుతున్నారు. ఈ వ్యాఖ్యలు చూస్తుంటే బెదిరింపు ధోరణిగానే ఉన్నాయని అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. అచ్చెన్నాయుడు చేసిన సంచలన వ్యాఖ్యలు జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే సంచలనమయ్యాయి. సోషల్ మీడియాలోనైతే హల్‌చల్ చేశాయి. పెద్ద ఎత్తున ట్రోలింగ్స్ కూడా జరిగాయి.

కూన ఎక్కడ..?

- మంత్రుల పర్యటనలో కనిపించని ఎమ్మెల్యే కూన రవికుమార్
- అసంతృప్తా..? ఆవేదనా..?
- పార్టీ శ్రేణుల్లో విస్తృత చర్చ



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసి జిల్లాకు వచ్చిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు పర్యటనలో మాజీ విప్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కనిపించలేదు. ఉద్దేశపూర్వకంగా గైర్హాజరయ్యారా? మరేదైనా కారణం ఉందా అన్నది తెలీదు గానీ టీడీపీలో మాత్రం ఇది తీవ్ర చర్చకు దారితీసింది. మంత్రి పదవి ఆశించి భంగపడిన కూన రవికుమార్ గుర్రుగా ఉండటం వల్లనే రాకపోయి ఉండొచ్చనే వాదన వినిపిస్తోంది.

మంత్రి పదవిపై ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కాళింగ సామాజిక వర్గం నుంచి తప్పనిసరిగా కేబినెట్‌లో బెర్త్ ఖాయమని భావించారు. కానీ అంచనాలు తలకిందలయ్యాయి. కింజరాపు ఫ్యామిలీకి ఇచ్చేందుకే మొగ్గు చూపారే తప్ప కూన రవికుమార్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో కాళింగ సామాజిక వర్గమంతా గుర్రుగా ఉంది. ప్రెస్‌మీట్లు, సమావేశాలు పెట్టి నిరసన కూడా తెలియజేశారు. చంద్రబాబు తీరుపై అసంతృప్తి వ్యక్తంచేయడమే కాకుండా సమయం వచ్చినప్పుడు తామేంటో చూపిస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కాళింగులు ఎన్ని చేసినా ఫలితం కనిపించడంలేదు. చంద్రబాబు నుంచి సానుకూలత రావడం లేదు. చిన్నా చితకా పదవి ఇచ్చి సరిపుచ్చుకునేలా ఉన్నారు. ఈ క్రమంలో భారీ ఆశలు పెట్టుకున్న కూన రవికుమార్ కూడా ఆవేదన చెందుతున్నట్టు సమాచారం. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిస్తే తమకిచ్చే గౌరవమిదా అని ఆయన వర్గీయులు బాధపడుతున్నారు.

కూన రవికుమార్‌తో పాటు కాళింగ సామాజిక వర్గమంతా అసంతృప్తితో ఉన్న వేళ.. జిల్లాలోకి అడుగు పెట్టిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడుకు స్వాగతం పలికేందుకు ఒక వర్గం హాజరు కాలేదు. సోమవారం రాత్రి జరిగిన ఆత్మీయ సభలోనూ పాల్గొనలేదు. మంగళవారం జిల్లా అధికారులతో జరిగిన తొలి సమావేశం ప్రాంగణానికి కూడా రాలేదు. ఏడు రోడ్ల కూడలి వద్ద మున్సిపల్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సభకు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ హాజరయ్యారు. కానీ, కూన రవికుమార్, బెందాళం అశోక్ ఎక్కడా కనిపించలేదు. మంగళవారం జెడ్పీలో జరిగిన అధికారుల సమావేశంలో కూడా వీరిద్దరూ పాల్గొనలేదు. కాళింగ సామాజిక వర్గానికి మొండి చేయి చూపారన్న అసంతృప్తితో ఉద్దేశపూర్వకంగా గైర్హాజరయ్యారా? లేదంటే మరే కారణం చేతో రాలేదా? అన్నది తెలియదు గాని పార్టీ శ్రేణులు మాత్రం కాళింగులకు జరిగిన అవమానం వలనే దూరంగా ఉండి ఉండవచ్చని అని చర్చించుకుంటున్నాయి.

వేడుకలో విషాదం



సిరిమాను ఊరేగింపు

- అసిరితల్లి పండగలో అపశ్రుతి
- కూలిన సిరిమాను రథం
- ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు
- ప్రమాదంలో తెగిపడిన పూజారి నాలుక



అప్పన్న (ఫైల్)



పల్లేటి (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి గ్రామంలో 14 ఏళ్ల తర్వాత జరిగిన అసిరితల్లి ఉత్సవాలు విషాదాన్ని మిగిల్చాయి. గత నెల 18న ఈ పండగలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ముగింపు వేడుకలు జరిగాయి. చివరి రోజు ఊరుఊరంతా ఆనందంగా పండగ చేసుకుంటున్న వేళ.. సిరిమాను రథం కూలి ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. ఒకరు గాయపడ్డారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

పండగలో చివరి రోజు కావడంతో భక్తుల సమక్షంలో అనుపు ఉత్సవంలో భాగంగా సిరిమానోత్సవం నిర్వహించారు. ప్రజలు ఆసక్తిగా ఉత్సవం చూస్తున్నారు. ఆనవాయితీ మేరకు బుడగుట్లపాలెంగ్రామానికి చెందిన వంద మంది రథం లాగుతున్నారు. సిరిమానుపై పూజారి నాయని చిన్నారెడ్డి కూర్చున్నారు. జనమంతా ఉత్సాహంగా చూస్తున్న వేళ.. సిరిమానుపై చిన్నారెడ్డి కూర్చున్న సిరిమాను పీఠం శీల విరిగిపోయింది. దీంతో రథం పీఠం ఒక్కసారిగా కూలి పోయింది. ఒక్కసారిగా రథం లాగుతున్న వారంతా చెల్లాచెదురై పోయారు. పీఠం అమాంతం ఇద్దరు వ్యక్తుల తలపై పడడంతో సూరాడ అప్పన్న (42) అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశాడు. తీవ్రంగా గాయపడిన కారి పల్లేటి (60)ని ఆటోలో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పీఠంపై కూర్చున్న కుప్పిలి గ్రామానికి చెందిన పూజారి నాయని చిన్నారెడ్డి కిందపడినప్పుడు పళ్ల మధ్య నాలుక కరుచుకోవడంతో ఏకంగా నాలుక తెగిపడింది. ప్రస్తుతం క్షతగాత్రుడు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు.



అప్పన్న మృతదేహం

ఎచ్చెర్ల ఎస్‌ఐ చిరంజీవి తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అప్పన్న మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. బుడగుట్లపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందటంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పల్లేటికి భార్య చిలకమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. చేపల వేట ఈయన బతుకు తెరువు. అప్పన్నకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నా రు. ఈయన కూడా చేపల వేటపై ఆధారపడి బతుకుతున్నారు. ఈ సంఘటనతో గ్రామమంతా విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. చిన్న శీల విరిగి ఇంత పెద్ద ప్రమాదం జరగడాన్ని గ్రామస్తులు తట్టుకోలేకపోతున్నారు. అనంతరం పోలీసుల భద్రత నడుమ సిరిమానోత్సవం పూర్తిచేశారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాం



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, అధికారులు

- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం: రానున్న ఐదేళ్లు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ముందున్న ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో కలిసి మంగళవారం జిల్లా అధికారులతో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో ప్రధాన శాఖలు నిర్వీర్యమయ్యాయని, వాటిని సాధారణ స్థితికి తీసుకు వచ్చి, ప్రగతి పథంలో నడిపించటం ముందున్న లక్ష్యమని అన్నారు. ఉద్యోగులు బాధ్యతగా, చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రతి సోమవారం జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తామని అన్నారు. ప్రతి అధికారి తూచా తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటే సహించేది లేదని చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, వారం రోజుల్లో సరిదిద్దాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు.

కథనాలు వస్తే చర్యలు తప్పవు..

శాఖల్లో లోపాలపై మీడియాలో కథనాలు వస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. వంశధార అధికారులు ప్రత్యేక దృష్టిసారించి శివారు భూములకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

శ్రీకాకుళం జిల్లాను పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేసుకున్న ఇద్దరు అధికారుల ముఖం చూడటం ఇష్టం లేక, వారిని బదిలీ చేశామని అన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అధికారులు తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమస్య పరిష్కారం కోసం అవసరమైతే ముఖ్యమంత్రితో మాట్లాడతానని తెలిపారు.

కేంద్రం నుంచి నిధులు తెప్పిస్తాం..

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రప్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. భోగాపురం విమానాశ్రయాన్ని ఏడాది లోపు పూర్తిచేస్తామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ పాతపట్నం బస్టాండ్ స్థలం ఆక్రమించే ప్రయత్నం జరుగుతోందని, అడ్డుకోవాలని అధికారులను కోరారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం రోడ్డు త్వరిత గతిన పూర్తిచేయాలని అన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ తన నియోజక వర్గంలో కొండలు, చెరువుల ఆక్రమణలు జరిగాయని, విచారణ చేయాలని కోరారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయాలన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. టెక్కలిలో స్వర్ణకారుల సహకార సంఘం భూమి ఆక్రమణపై విచారణ నిర్వహించాలని సూచించారు. నివేదిక త్వరిత గతిన సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్, ఎస్పీ జీఆర్ రాధిక, మున్సిపాల్ కమిషనర్ తమీన్ అన్సారియా, డీఆర్వో గణపతిరావు మాట్లాడారు.

అక్రమంగా ఇసుక తరలింపు

శ్రీకాకుళం రూరల్: అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని శ్రీకాకుళం రూరల్ పోలీసులు మంగళవారం రాత్రి మండల పరిధిలోని బైరి పరిసర ప్రాంతంలో పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా విశాఖపట్నంకు 20 టన్నుల ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై రూరల్ ఎస్‌ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



అబుల్‌కలాం మాలిక్ మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి బీచ్‌లో గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమైంది. రణస్థలం మండలంలో పనిచేస్తున్న 8మంది స్నానానికి చింతపల్లి బీచ్‌కు రాగా వారిలో అబుల్‌కలాం మాలిక్ గల్లంతవడంతో ఫిర్యాదు మేరకు మెరైన్ పోలీసులు, లోకల్ పోలీసులు, రెవెన్యూ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు గల్లంతైన ప్రదేశం నుంచి సుమారు మూడు కిలో మీటర్ల దూరంలో అబ్దుల్ కలాం మాలిక్ మృతదేహం లభ్యమైంది. మాలిక్ స్వస్థలం పశ్చిమబెంగాల్ కావడంతో సమాచారం మేరకు బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీఐ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభం



మొదటి ర్యాంకు విద్యార్థి బుడుమూరు సురేష్‌కు ప్రవేశ పత్రం అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల ప్రవేశాల కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు 1 నుంచి 413 ర్యాంకు మధ్య విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించగా, 153 మంది ప్రవేశాలు పొందారు. కౌన్సెలింగ్‌కు హాజరైన మొదటి ర్యాంకు విద్యార్థి బుడుమూరు సురేష్‌కుమార్ ఎలక్ట్రీషియన్ ట్రేడ్ శ్రీకాకుళం డీఎల్‌టీసీలో ఎంపిక చేసుకోగా, అధికారులు అడ్మిషన్ పత్రం అందజేశారు. విద్యార్థులు ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ఎంపిక చేసుకున్న ట్రేడ్‌లను అధికారులు కేటాయిస్తున్నారు. మొదటి రోజు కౌన్సెలింగ్ పూర్తికాగా, రెండో రోజు బుధవారం 414–877 మధ్య ర్యాంకు విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జిల్లాలో మూడు ప్రభుత్వ ఐటీఐల్లో 716 సీట్లు, 20 ప్రైవేట్ ఐటీఐల్లో 2892 సీట్లు, మొత్తం 3608 సీట్లు ఉన్నాయి. 2490 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 23 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. 25, 26 తేదీల్లో హాజరు కాని విద్యార్థులు, ప్రవేశాలు లభించని విద్యార్థుల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. కౌన్సెలింగ్ ప్రక్రియను జిల్లా ఉపాధి, ఉద్యోగ కల్పన అధికారి సుధ, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు, అడ్మిషన్స్ కమిటీ సభ్యులు చిట్టి నాగభూషణం, ప్లేస్ మెంట్ అధికారి కామేశ్వరరావు, శిక్షకులు పొదిలాపు వెంకటరమణ పర్యవేక్షించారు.

సప్లిమెంటరీలో 65.36 శాతం ఉత్తీర్ణత

- ద్వితీయ సంవత్సరం ఫలితాలు విడుదల
- 7431 మంది పరీక్షకు హాజరుకాగా 4857 మంది పాస్



శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. మే 24 నుంచి 31వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరగగా.. మంగళవారం ఫలితాలు విడుదల చేశారు. ఆన్‌లైన్ ద్వారా జవాబు పత్రాలను మూల్యాంకనం చేయడం విశేషం. ఈ పరీక్షలకు జిల్లా నుంచి మొత్తం 7431 మంది హాజరుకాగా 4857 మంది ఉత్తీర్ణులయ్యారు. 65.36 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మరికొద్ది రోజుల్లో ప్రథమ సంవత్సరం ఫలితాలు వెలువడనున్నాయి.

మేనేజ్‌మెంట్లవారీగా..

- ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీల విభాగం 9 కాలేజీల్లో 110 మంది పరీక్షలకు హాజరుకాగా 72.73 శాతం ఉత్తీర్ణతతో 80 మంది పాసయ్యారు.
- ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్ విభాగం నుంచి 56 మంది పరీక్ష రాయగా 69.64 శాతం ఉత్తీర్ణతతో 39 మంది పాసయ్యారు.
- సహకార జూనియర్ కాలేజీల విభాగం 2 కాలేజీల నుంచి 168 మంది పరీక్షకు హాజరుకాగా 52.98 శాతం ఉత్తీర్ణతతో 89 మంది పాసయ్యారు.
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల విభాగం నుంచి 38 కాలేజీలుండగా 2309 మంది పరీక్ష రాయగా 66.96 శాతం ఉత్తీర్ణతతో 1546 మంది పాసయ్యారు.
- హైస్కూల్ ప్లస్ విభాగం నుంచి 2 కాలేజీలు (టెక్కలి, వజ్రపుకొత్తూరు) ఉండగా 11 మంది పరీక్ష రాయగా 81.82 శాతం ఉత్తీర్ణతతో 9 మంది పాసయ్యారు.
- కేజీబీవీ జూనియర్ కాలేజీల విభాగం నుంచి 22 కాలేజీల నుంచి 154 మంది పరీక్ష రాయగా 70.78 శాతం ఉత్తీర్ణతతో 109 మంది పాసయ్యారు.
- ఏపీ మోడల్ స్కూల్ కాలేజ్ విభాగం నుంచి 299 మంది పరీక్షకు హాజరుకాగా 69.57 శాతం ఉత్తీర్ణతతో 208 మంది పాసయ్యారు.
- ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కాలేజ్ విభాగం నుంచి 4324 మంది పరీక్షకు హాజరుకాగా 64.22 శాతం ఉత్తీర్ణతతో 2777 మంది పాసయ్యారు.

క్లుప్తంగా

వలలు దగ్ధం



కాలిపోతున్న చేపల వలలు

సంతబొమ్మాళి: భావనపాడు తీరంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు రెండు చేపల రింగ్ వలలను దహనం చేశారు. విషయం తెలుసుకున్న మత్స్యకారులు సంఘటనా స్థలాన్ని చేరుకొని మంటలను అదుపు చేయాలని ప్రయత్నించినా అప్పటికే వలలు అగ్నికి దగ్ధమయ్యాయి. సుమారు రూ. 15లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత మత్స్యకారులు గొరకల ఆదినారాయణ తెలిపారు. దీనిపై నౌపడ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



హిరమండలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

హిరమండలం: అవలంగి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమీప తోటల్లో మృతదేహం కనిపించడంతో స్థానికులు హిరమండలం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించారు. మృతుడి వయస్సు 50–70 ఏళ్లు ఉంటుంది. పంచెకట్టుతో ఉన్న మృతుడు ఈ ప్రాంతం వాడేనని అనుమానిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు హిరమండలం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ జి.నారాయణస్వామి సూచించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

దొంగిలించిన బంగారం, డాలర్లు స్వాధీనం

సోంపేట: మండలంలోని బారువ గ్రామానికి చెందిన సీపాన రోహిణమ్మ ఈ నెల 17వ తేదీన సోమవారం ఉదయం బారువ నుంచి సోంపేట వస్తుండగా 5 తులాల బంగారం, 1240 ఆస్ట్రేలియా డాలర్లతో ఉన్న బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. సోమవారం రాత్రి సోంపేట పోలీసులకు రోహిణమ్మ ఆటో నంబర్‌తో సహా ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆటోలో ప్రయాణించిన వారిని గుర్తు పట్టి వారి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన వారిని గజపతినగరానికి చెందిన వారుగా గుర్తించినట్లు ఎస్‌ఐ బి.హైమావతి తెలిపారు. వీధుల్లో చిన్న చిన్న వస్తువులు అమ్ముకుంటూ వ్యాపారం చేస్తుంటారని పేర్కొన్నారు.

రెండు ఇసుక లారీల పట్టివేత



గార స్టేషన్ వద్ద ఇసుక లారీలు

గార: మండలంలోని బూరవెల్లిలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం వేకువజామున ఒక లారీని సెబ్ పోలీసులు, మరో లారీని గార పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కె. కృష్ణప్రసాద్ తెలిపారు.

20 నుంచి ప్రథమ చికిత్సపై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో ప్రథమ చికిత్సపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పి.జగన్మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల్లో, కంపెనీల్లో, దుకాణాల్లో పనిచేస్తున్న కార్మికులు, విద్యాసంస్థల్లో ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిక్షణకు వచ్చే ప్రతి వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ యాప్ ద్వారా వలంటీర్‌గా నమోదు చేసుకోవాలని కోరారు. శిక్షణలో పాల్గొనే ప్రతి వ్యక్తి రూ.1500లు ఢిల్లీ రెడ్‌క్రాస్ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాలని, వారు సర్టిఫికేషన్ చేస్తారని తెలిపారు.

షాపుల వెనుక అగ్ని ప్రమాదం



షాపుల వెనుక భాగంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నరసన్నపేట: స్థానిక కాలేజీ రోడ్డులో రాజుల చెరువు వైపు ఉన్న షాపుల వెనుక భాగంలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. మెకానిక్ రమణ షాపు నుంచి ఎస్‌ఆర్‌కే టైలర్ షాపుల వరకూ వెనుక భాగంలో మంటలు వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షాపుల వెనుక వేసిన వ్యర్థాల వద్ద ఈ మంటలు అంటుకున్నాయి. షాపులు కూడా కాలిపోతాయేమోనని అంతా భయపడ్డారు. అయితే అగ్ని మాపక సిబ్బంది స్పందించడంతో ఎలాంటి నష్టం జరగలేదు.

ప్రైవేటు బడుల్లో ఫీ‘జులుం’

- ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల పేరిట యథేచ్ఛగా దోపిడీ
- పుస్తకాల పేరుతోనూ దోచుకుంటున్న వైనం
- ఆధారాలతో సంప్రదిస్తే చర్యలు తీసుకుంటామంటున్న విద్యాశాఖాధికారులు



శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పంపిణీకి సిద్ధంగా ఉన్న పుస్తకాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రైవేటు పాఠశాలలు దోపిడీకి తెర తీశాయి. చాలా పాఠశాలలు విద్యను సేవగా అందిస్తుండగా కొందరు మాత్రం ఈ ముసుగులో సిండికేట్‌గా ఏర్పడి ఏటా ఫీజులను అమాంతం పెంచేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఫీజులు భారీగా పెంచేశారు. స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం పేరుతో సామాన్యుల నడ్డి విరుస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

30 మండలాలతో కూడిన శ్రీకాకుళం జిల్లాలో మొత్తం ప్రైవేటు పాఠశాలలు 398 ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 79, ప్రాథమికోన్నత 136, ఉన్నత పాఠశాలలు 183 ఉన్నాయి. వీటిన్నింటిలో కలిపి మొత్తం విద్యార్థులు 91,049 మంది చదువుతున్నారు. ఇందులో బాలురు 54194 మంది, బాలికలు 37755 మంది ఉన్నారు. ఈ పాఠశాలల్లో 3624 మంది టీచర్లు పాఠాలు బోధిస్తున్నారు. అలాగే జిల్లాలో ప్రైవేట్ జూనియర్ కాలేజీలు 89 ఉన్నాయి. వీటిలో 39,510 మంది వరకు చదువుతున్నారు.

రకరకాల పేర్లతో..

సూపర్ 60 అని, సీబ్యాచ్ అని, ఒలింపియాడ్ అని, ఐకాన్ అని ఇలా రకరకాల పేర్లతో ప్రైవేటు పాఠశాలలు భారీగా దండుకుంటున్నాయి. వాస్తవానికి ఈ నెల 13న పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. బడులు తెరుచుకోవడానికి ముందు నుంచే ఓ వైపు స్కూల్ ఫీజులు, మరోవైపు పుస్తకాల దందా కొనసాగుతోంది. ఆయా పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు యూనిఫాం కూడా తమ వద్దనే తీసుకోవాలని, స్టాక్ బయట లేదని సుస్పష్టం చేసేస్తున్నారు. స్కూళ్లలోనే కుట్టిన దుస్తులు అందజేస్తున్నారు. ఇంకొన్ని చోట్ల క్లాత్‌లు అందజేస్తున్నారు. వీటితోపాటు లైబ్రరీ, వ్యాయామం, కంప్యూటర్ వర్క్, ల్యాబ్‌వర్క్స్, కల్చరల్ యాక్టివిటీస్, స్కూల్ బస్‌చార్జీల పేరుతో ఫీజులు దండుకుంటున్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్స్ తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిందేనంటూ యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారు.

కోట్లలో వ్యాపారం..

ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రైవేటు పాఠ్యాంశాలే ఉండటంతో యాజమాన్యాలు వారి ఇష్టం వచ్చిన ధరలకు పుస్తకాలు అమ్మేస్తున్నాయి. పెద్ద పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు పాఠ్య, తరగతి నోటు పుస్తకాలకు రూ.3వేల నుంచి రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా తరగతి పెరిగే కొద్దీ వాటి ధరలను పెంచి వ్యాపారం కొనసాగిస్తున్నారు. పదో తరగతికి చేరే సరికి రూ.12వేల వరకు పుస్తకాలకే వెచ్చిస్తున్నారు. సాధారణ ప్రైవేటు పాఠశాలల్లో ప్రీప్రైమరీ నుంచి టెన్త్ వరకు రూ.1500 నుంచి రూ.6000 వరకు వసూలు చేస్తున్నారు. విద్యాశాఖాధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తూ వదిలేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.

ప్రభుత్వ బడుల్లో ఉచిత విద్య

ప్రభుత్వ బడుల్లో రూపాయి ఖర్చు లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు గత ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకొచ్చింది. ఇంగ్లిష్ మీడియం విద్య, సిలబస్‌లో మార్పులు, తెలుగు, ఇంగ్లిష్ మీడియంలతో కూడిన బైలాంగ్వల్ పాఠ్యపుస్తకాల పుస్తకాలతోపాటు రూపాయి ఖర్చు లేకుండా స్టూడెంట్స్ కిట్స్ అందిస్తున్నారు. నాణ్యమైన రుచికరమైన పీఎం–పోషణ్ గోరుముద్ద పేరిట మధ్యాహ్న భోజనం, ఆరోగ్యానికి రాగిజావ అందిస్తున్నారు. మనబడి నాడు–నేడుతో బడుల్లో సరికొత్త సదుపాయాలు ఉన్నాయి.

తనిఖీలు చేపడతాం



ప్రైవేటు పాఠశాలల్లో చేరక ముందే విద్యార్థుల తల్లిదండ్రులు వాటికి అనుమతులు ఉన్నాయో లేదో తెలుసుకోవాలి. చాలా పాఠశాలలకు అనుమతి లేదు. రెన్యువల్ కూడా లేదు. అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటాం. ఫీజుల వివరాలను అన్ని స్కూళ్లలో నోటీసు బోర్డుల్లో విధిగా పేర్కొనాలి. పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతాం. తమకు ఆధారాలతో సహా విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే కచ్చితంగా చర్యలు చేపడతాం. యాజమాన్యాలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– కె.వెంకటేశ్వరరావు, డీఈఓ, శ్రీకాకుళం

300 నాటుసారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్ట్



సెబ్ అధికారులు సీజ్ చేసిన బైక్, నాటుసారా ప్యాకెట్లు

కంచిలి: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో మండలంలోని కత్తివరం గ్రామ కూడలి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, అదే గ్రామానికి చెందిన మద్దిల ప్రసాద్ అనే వ్యక్తి నాటుసారా ప్యాకెట్లతో మంగళవారం పట్టుబడ్డాడు. నిందితుడు ప్రసాద్ ద్విచక్ర వాహనంపైన ప్లాస్టిక్ కవర్‌లో 300 నాటుసారా ప్యాకెట్లను తరలిస్తుండగా సీఐ జై భీమ్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇతను రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం గానీ, నాటుసారా గానీ అక్రమంగా తరలిస్తున్నా కఠిన చర్యలు తప్పవని సీఐ జై భీమ్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పలాస టాస్క్‌ఫోర్స్ సీఐ రామచంద్ర కుమార్, సిబ్బంది మోహనరావు, కాంతారావు, అప్పలరాజు, భాను, నాయుడు పాల్గొన్నారు.

ముమ్మరంగా జీడి పిక్కల కొనుగోలు

పలాస:



మామిడిపల్లిలో జీడి పిక్కల కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ఉద్దానం ప్రాంత గ్రామాల్లో జీడిపిక్కల కొనుగోలు ముమ్మరంగా జరుగుతోంది. ఇటీవల జీడి రైతాంగ పోరాట కమిటీలు ఇచ్చిన పిలుపు మేరకు గ్రామాల్లో గ్రామ కమిటీలు ఆధ్వర్యంలో జీడి పిక్కల ధరలను ఆయా గ్రామాల్లోనే తేల్చారు. గ్రామాల్లో కనీసం 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.11వేలు అయితే సరిపోతుందని తీర్మానాలు చేసుకున్నారు. అందుకు భిన్నంగా ఎవరూ కూడా ఊహించని రీతిలో ధరల్లో మార్పులు వచ్చాయి. మూకుమ్మడిగా జీడి వ్యాపారులు గ్రామాల్లోకి వచ్చి పోటా పోటీగా పిక్కలను కొనుగోలు చేస్తున్నారు. మంగళవారం ఉదయం ఒక గ్రామంలో జీడి పిక్కల బస్తా రూ.12వేలు కాగా సాయంత్రం సరికి రూ.13వేలుగా ఆయా గ్రామాల్లో ధర నిర్ణయించారు. పలాస మండలం మామిడిపల్లి గ్రామంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు రూ.13వేలు చొప్పున జీడి పిక్కలను కొనుగోలు చేసి తీసుకొని వెళ్లారు.

పుష్పయాగంతో ముగిసిన కల్యాణ క్రతువు



వెంకన్నకు పుష్పాలతో అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిన్నబజారులో ఉన్న దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం పుష్పయాగం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు రేజేటి వేంకట శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో భూదేవి, శ్రీదేవి సమేతంగా వేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులకు 12 రకాల పూలతో అలంకరణ చేసి 12 రకాల పిండివంటలు సమర్పించారు. ఉదయం స్వామికి చక్రస్నానం నిర్వహించారు. అలాగే స్వామివారి పవళింపు సేవ నిర్వహించారు. పద్మావతి శిష్య బృందంతో అన్నమాచార్య సంకీర్తన జరిగింది.

రిమ్స్ హెచ్‌ఓడీగా డాక్టర్ షకీల



శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలో ఉన్న రిమ్స్ హెచ్‌ఓడీ ఆఫ్ ఫిజియాలజీ, మెడికల్ కాలేజీ ప్రొఫెసర్‌గా డాక్టర్ దాసరి షకీల మంగళవారం విధుల్లోకి చేరారు. రిమ్స్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలను ఈమెకు అప్పగించారు. మెడికల్ కాలేజీ, రిమ్స్ ఆస్పత్రి సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

మహిళపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: అక్రమ సంబంధం అనుమానం నేపథ్యంలో ఆరుగురు మహిళలు మరో మహిళపై దాడి చేశారు. కుశాలపురం పంచాయతీ నవభారత్ ప్రాంతానికి చెందిన ఓ మహిళను శ్రీకాకుళం పట్టణం దమ్మల వీధికి చెందిన భవానీ అనే మహిళ మరో ఐదుగురితో కలిసి ఇంటిలోకి వెళ్లి బయటకు తీసుకువచ్చింది. కంటిలో కారం కొట్టి ఆటోలో తీసుకు వెళ్లి పిడి గుద్దులతో అంతా కలిసి దాడి చేశారు. భవానీ భర్తకు మంగకు అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో ఈమె ఈ దుశ్చర్యకు పాల్పడింది. దాడిలో తీవ్రంగా గాయపడిన మంగ అపస్మారక స్థితికి చేరుకోగా దాడి చేసిన మహిళలే శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. ఆరోగ్య పరీక్షల అనంతరం బాధితురాలు ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై ఔట్ పోస్టు పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. బాధితురాలు నవభారత్‌కు చెందిన మహిళ కావటంతో ఎచ్చెర్ల పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆరుగురు మహిళలపై దాడి కేసు నమోదు చేశారు.

• ఉత్సాహంగా ఉపాధి



సాయంత్రం వేళ ఉపాధి పనిలో..

పలాస, మందస మండలాల్లో ఉపాధి పనులు జోరుగా జరుగుతున్నాయి. మందస మండలం సందూరు గ్రామంలో ఇలా వేతనదారులు చెరువులో ఉత్సాహంగా పనిచేస్తూ కనిపించారు. వానలు పడుతుండడంతో చెట్ల చుట్టూ కందకాలు, హార్టికల్చర్, ఎవెన్యూ ప్లాంటేషన్, బండ్ ప్లాంటేషన్, పూడిక తీతలు వంటి పనులు చేస్తున్నారు.

– కాశీబుగ్గ



మట్టి తవ్వుతున్న దృశ్యం



పనిచేస్తున్న వేతనదారులు



మట్టి ఎత్తుతున్న మహిళలు

మధ్యవర్తిత్వంతోనే భవిష్యత్‌లో కేసుల పరిష్కారం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న కాలంలో ఎక్కువ కేసులు రాజీమార్గం ద్వారానే పరిష్కారమవుతాయని, దీని వల్ల డబ్బు, కాలం ఆదా అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఐదు రోజుల పాటు జరిగే 40 మంది న్యాయవాదుల శిక్షణ కార్యక్రమం మంగళవారం కోర్టులో హాల్‌లో ప్రారంభమైంది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఎంపిక చేసిన న్యాయవాదులు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకుని ప్రజలకు తమ సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. దేశ అత్యున్నత న్యాయస్థానం మధ్యవర్తిత్వం, సంధి ప్రాజెక్టు కమిటీ (ఎంసీపీసీ) మధ్యవర్తిత్వం భవన–సాంకేతికలపై శిక్షణ ఇస్తుందని తెలిపారు. కక్షిదారులను విడివిడిగా ఒకరి తర్వాత ఒకరిని మధ్యవర్తిత్వం చేయడం వల్ల వారికి పూర్తి సమాచారం అందజేస్తారని తెలిపారు.

పలాసలో భారీ వర్షం



కేటీరోడ్డులో కురుస్తున్న వర్షం

కాశీబుగ్గ:

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండతో ప్రజలు ఇబ్బందులు పడగా.. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంటన్నరకుపైగా కురిసిన వర్షానికి కేటీ రోడ్డు వరదనీటితో నిండిపోయింది. దీంతో వాహన, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

భిక్షాటన చేస్తూ వ్యక్తి మృతి

శ్రీకాకుళం రూరల్: అరసవల్లి ఇందిరా విజ్ఞాన్ భవన్ వద్ద ఓ యాచకుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. రూరల్ ఎస్‌ఐ ఇచ్చిన వివరాలు మేరకు.. కనిమెట్ట గ్రామానికి చెందిన రఘుపతి శ్రీరామ్మూర్తి (45) బోడెమ్మ కోవెల సమీపంలో భిక్షాటన చేస్తుండేవారు. అనారోగ్యం కారణంగా మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

• మొక్కుల చెల్లింపు



ముర్రాటలతో బారులు తీసిన మహిళలు



అమ్మవారికి ముర్రాటలు సమర్పిస్తున్న భక్తులు

పెంట గ్రామంలో కనకదుర్గమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముందుగా చెవిటిపోలమ్మ అమ్మవారికి మొక్కుబడులు తీర్చారు. మహిళలు ముర్రాటలు సమర్పించారు.

– జి.సిగడాం